క్లుప్తంగా

రూ.42 లక్షలతో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం



రైల్వే న్యూకాలనీలో శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ ఆళ్ల లీలావతి

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీ లక్ష్మీగణేష్ ఆలయం వీధిలో రహదారులు, డ్రైనేజీల నిర్మాణానికి గురువారం కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. జీవీఎంసీ నిధులు సుమారు రూ.42 లక్షలతో ఈ ప్రాంతంలో పాత రోడ్లు, డ్రైనేజీల స్థానంలో కొత్తవి నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఏఈ రమణమ్మ, మాజీ కార్పొరేటర్ బులుసు జగదీష్, పార్టీ నాయకులు ఆళ్ల శ్రీనివాసరావు, ఎస్.ప్రసాదరావు, వెంకటేష్, ఇంద్ర, సూర్యనారాయణ, రమణమూర్తి, గౌరి, గీత, కనకమహాలక్ష్మి, కృష్ణవేణి పాల్గొన్నారు.

గురజాడను కళ్లముందుంచిన 'కన్యాశుల్కం'



కన్యాశుల్కం నాటికలోని ఓ సన్నివేశం

తాటిచెట్లపాలెం: మహాకవి గురజాడ అప్పారావు వర్ధంతి సందర్భంగా విశాఖపట్నం పోర్టు అథారిటీ, కె.వి.మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ సంయుక్త నిర్వహణలో గురువారం సాలగ్రామపురం సీతారామ కల్యాణ మండపం వద్ద గల సాగరి ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో కన్యాశుల్కం నాటికను ప్రదర్శించారు. ఆద్యంతం ఆనాటి ఘట్టాలను వీక్షకుల ముందుంచారు. ముఖ్య అతిథులు దాడి వీరభద్రరావు, వి.వి.రమణమూర్తి, పైడా కృష్ణప్రసాద్, దాడి సత్యనారాయణ, ఐ.వెంకటేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

21 రోజుల పాటు కైంకర్యం



స్వాములకు అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో సీతంపేట దుర్గాగణపతి ఆలయం వద్ద అయ్యప్ప స్వాములకు రాత్రి పూట కైంకర్యం ప్రారంభించారు. 21 రోజుల పాటు ప్రతి రోజూ రాత్రి 50 మంది స్వాములకు కైంకర్యం అందజేస్తామని ఆయన తెలిపారు. అనంతరం స్వాములకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో సారిపిల్లి గంగరాజు, మొకర వెంకటరావు, ముద్దాడ యల్లాజీరావు, ఒమ్మి ఆనంద్, పాలిశెట్టి బుజ్జి, వానపల్లి బాబు, ఉప్పిలి అప్పన్న, గుడివాడ గౌరినాయుడు, ఉప్పాడ సన్నీ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఫొటోథెరపీ యూనిట్ వితరణ



ట్రస్టీ ఉమామహేశ్వరరావుకు యూనిట్‌ను అందజేస్తున్న చెరుకు శ్రీరామ్మూర్తి

సీతమ్మధార: లయన్స్ క్యాన్సర్ అండ్ జనరల్ హాస్పిటల్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ వి.ఉమామహేశ్వరరావుకు లయన్స్ క్లబ్ నార్త్ ఈస్ట్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు చెరుకు శ్రీరామ్మూర్తి ఫొటోథెరఫీ యూనిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ ఈ థెరఫీ యూనిట్ చంటిపిల్లాడికి, పచ్చకామెర్లుకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రంధి వీరభద్రరావు, కాశీ విశ్వనాథ్, చెన్న కృష్ణమూర్తి పాల్గొన్నారు.

స్వగృహ ప్రాప్తిరస్తు

రాష్ట్రంలోని ఏ ఒక్క పేద కుటుంబం సొంత గూడు లేకుండా ఉండకూడదన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయం. అందుకనుగుణంగా పేదలకు సొంతిళ్లు నిర్మించి అందించాలని సంకల్పించారు. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకాన్ని ప్రవేశపెట్టి అర్హులందరికీ గృహయోగం కల్పించారు. మరోవైపు ఏపీ టిడ్కో హౌసింగ్ స్కీం ద్వారా పూరిగుడిసెల్లో నివసిస్తున్న వారికి ఉన్న చోటే సకల సదుపాయాలతో గృహ సముదాయాలు నిర్మించి అందజేస్తున్నారు. నియోజకవర్గంలోని పలువురు పేదలకు టిడ్కో ఇళ్లు అందించి వారి కళ్లలో ఆనందం చూశారు.



45వ వార్డు ఏఎస్సార్ నగర్‌లో నిర్మించిన టిడ్కో గృహ సముదాయం

ఇది కదా అభివృద్ధి

- పూరిగుడిసెల నుంచి శాశ్వత భవనాలకు పేదలు
- ఏఎస్సార్ నగర్‌లో టిడ్కో ఇళ్ల నిర్మాణం
- సకల సదుపాయలతో సుందరంగా గృహ సముదాయాలు
- సీఎం జగన్ మేలుపై లబ్ధిదారుల హర్షం

ఒక్కో టిడ్కో ఇంటి నిర్మాణ వాస్తవ ధర

300 చ.గ.	రూ.6.55 లక్షలు
365 చ.గ.	రూ.7.55 లక్షలు
430 చ.గ.	రూ. 8.55 లక్షలు

ప్రభుత్వం నిర్ణయించిన ధర

300 చ.గ.	రూ.500
365 చ.గ.	రూ.3.15 లక్షలు
430 చ.గ.	రూ.3.65 లక్షలు



అందమైన గదులతో లబ్ధిదారు ఇల్లు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డులోని ఏఎస్సార్ నగర్ ఒకప్పుడు నగర నడిబొడ్డున ఉన్న మురికివాడ. నేడు ఇది ఎంతో సుందరంగా తీర్చిదిద్దిన అద్భుతమైన కాలనీ. నాడు పూరిగుడిసెలు, టార్పాలిన్‌లతో ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక ఆవాసాలు దర్శనమిచ్చేవి. నేడు అపార్ట్‌మెంట్ వాసుల మాదిరి ప్రత్యేక గృహాల్లో హాయిగా ఉంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నో చుక్కలు చూపించిన లబ్ధిదారులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత రివర్స్ టెండరింగ్ ద్వారా నిధులు ఆదా చేసి శరవేగంగా పనులు పూర్తయ్యేలా చేసింది. ఈ ప్రాంతంలో సుమారు 3 తెగలకు చెందిన వారు నివసిస్తున్నారు. ఏఎస్సార్ నగర్‌లో పూర్తయిన టిడ్కో ఇళ్లను నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ కంపా హనోకుల చేతుల మీదుగా జీవీఎంసీ అధికారుల సమక్షంలో ఈ ఏడాది జూలైలో లబ్ధిదారులకు అందజేశారు.

ఒక్క రూపాయికే రిజిస్ట్రేషన్

ఏఎస్సార్ నగర్‌లో నివసిస్తున్న పేదలందరికీ వారి వాటా కాకుండా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం కేవలం ఒక్క రూపాయికే రిజిస్ట్రేషన్ పూర్తిచేయించి, ఇంటి పట్టాలు అందజేసింది. పేదలపై భారం పడకూడదనే ముఖ్యమంత్రి సంకల్పంతో వీరందరికీ ఇళ్లు కేటాయించడంతో లబ్ధిదారులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

ఆరు బ్లాకులు.. 280 యూనిట్లు

ఏఎస్సార్ నగర్‌లో మొత్తం 288 టిడ్కో ఇళ్లు నిర్మించారు. వీటిలో మొదటి విడతగా 134 ఇళ్లకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి, లబ్ధిదారులకు పట్టాలు, ఇంటి తాళాలను అందజేశారు. ఈ ప్రాంతంలో నివసిస్తున్న పేదల కోసం ఇక్కడ సుమారు 10 బ్లాకుల్లో 472 యూనిట్లు నిర్మించడానికి 2019 జనవరిలో నాటి ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు శంకుస్థాపన చేశారు. చాలా కాలం పనులు ప్రారంభించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రివర్స్ టెండరింగ్ ద్వారా టాటా, ఇంద్రజిత్ మెహతా కంపెనీలకు పనులను అప్పగించింది. సుమారు 15 శాతం తక్కువకు ఈ పనులను కాంట్రాక్టర్లకు అప్పగించారు. ఇక్కడ 10 బ్లాకులకు గానూ మొదటి దశలో 300 చ.గ. యూనిట్లు 184, 365 చ.గ.యూనిట్లు-48, 430 చ.గ. యూనిట్లు-48 మొత్తం ఆరు బ్లాకుల్లో 280 యూనిట్లు ప్రారంభించారు. ఇవన్నీ జీ ప్లస్ 3 తరహాలో నిర్మించారు.

మౌలిక వసతులు

ఇళ్ల నిర్మాణం పూర్తయిన వెంటనే మౌలిక వసతులు పూర్తిగా కల్పించారు.

ప్రతి ఇంటికీ విద్యుత్, నీటి కనెక్షన్‌లు, శానిటేషన్ ఇలా ప్రతీ పనిని పూర్తిచేశారు. ప్రతీ బ్లాక్‌కు మధ్యలో విశాలమైన రోడ్లు, కాలనీకి అత్యాధునిక మెటీరియల్‌తో ఆధునిక రోడ్లు వేశారు. తాటిచెట్లపాలెం జాతీయ రహదారి నుంచి కాలనీకి సుందరమైన రహదారి నిర్మించారు. కాలనీ వాసులకు అవసరమైన తాగునీటి కోసం ట్యాంక్ నిర్మించారు.



టిడ్కో ఇళ్లకు ఏర్పాటు చేసిన విద్యుత్ మీటర్లు



లబ్ధిదారుకు ఇంటి తాళం అందజేస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, కార్పొరేటర్ హనోకు(ఫైల్)

సొంతింటి కల నిజమైంది



ఏఎస్సార్ నగర్‌లో సుమారు 50 ఏళ్లుగా నివసిస్తున్నాం. గతంలో ఇక్కడ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మా సొంతింటి కలను నిజం చేసింది. ఈ ప్రాంతంలో ఇంత మంచి ఇళ్లు నిర్మించి ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేలు మరచిపోలేం.

– జి.కోటమ్మ, టిడ్కో గృహ లబ్ధిదారు

చాలా సంతోషంగా ఉంది



గతంలో ఇక్కడ ఇళ్లు నిర్మించాలని ఎన్నో సార్లు అధికారులు, నాయకుల చుట్టూ తిరిగాం. పని జరగలేదు. ఇప్పుడు ఈ ప్రభుత్వం వచ్చాక మా కళ్ల ముందే మాకు శాశ్వత నివాసాలను కట్టించి ఇచ్చినందుకు చాలా సంతోషిస్తున్నాం. ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు.

– ఎ.నాగమ్మ, లబ్ధిదారు, ఏఎస్సార్ నగర్

సీఎం జగన్‌తోనే సుపరిపాలన

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- వార్డుల్లో ఉత్సాహంగా 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం

సీతంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సుపరిపాలన, రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు అన్నారు. పార్టీ 26వ వార్డు ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం బోరావారి వీధిలోని 128 సచివాలయంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పార్టీ జెండా ఎగురవేసి, సచివాలయ పరిధిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎక్కడా లేనివిధంగా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేసిన ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. ఆయన వెంట ప్రజలంతా ఉండాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు బాణాల శ్రీనివాసరావు, అల్లు శంకరరావు, ఏపీడీ దుర్గాప్రసాద్, డైరెక్టర్లు పాండవ శ్రీను, జేసీఎస్ మండల కన్వీనర్ బులుసు జగదీష్, రామలింగేశ్వరాలయ చైర్మన్ బొడ్డేటి కిరణ్‌కుమార్, వార్డు నాయకులు నవాబ్, గండ్రేటి రవి, శేషు, అమ్మాజీ, బాబ్‌జాన్,పద్మా, ప్రకాష్, రమాదేవి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



48వ వార్డు సచివాలయంలో పార్టీ జెండాను ఎగురవేస్తున్న కె.కె.రాజు



26వ వార్డులో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల డిజిటల్ బోర్డు ఆవిష్కరిస్తున్న కె.కె.రాజు

ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు జైభారత్‌నగర్ 276 సచివాలయం పరిధిలో పార్టీ వార్డు ఇన్‌చార్జి నీలి రవి ఆధ్వర్యంలో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ప్రారంభించారు. పార్టీ జెండాను, సంక్షేమ పథకాల బోర్డును ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగున్నరేళ్ల పరిపాలనలో రాష్ట్ర ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందాయన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అల్లు శంకరరావు, పార్టీ సీనియర్ నాయకుడు కర్రి రామారెడ్డి, పద్మావతి, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, సీవోలు, ఆర్పీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జగన్‌ను మళ్లీ గెలిపించుకుందాం

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో 1086124 సచివాలయం పరిధిలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్... కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసి, కార్యక్రమ బ్రోచర్, కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షులు జి.వి.రమణి, జేసీఎస్ మండల కన్వీనర్ కర్రి మురళీకృష్ణారెడ్డి, గుడ్ల అశోక్‌రెడ్డి, నక్క రాజశేఖర్‌రెడ్డి, ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయ ట్రస్ట్ చైర్మన్ నక్క అప్పలరెడ్డి, కుమారి, బోర రామిరెడ్డి, నక్క ప్రకాష్‌రెడ్డి, చిన్నా, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమం

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు అంబేడ్కర్ కాలనీ 287 సచివాలయంలో నిర్వహించిన ఏపీకి జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమంలో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని, అందుకే 2024లో కూడా మళ్లీ ఆయనే కావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైడి కృష్ణారావు మాస్టరు, జేసీఎస్ మండల కన్వీనర్ అమర్‌రెడ్డి, నాయకులు బి.తిరుమలరావు, మెట్ట దమయంతి, కరిమిరెడ్డి శ్యామ్, గణేష్, వరలక్ష్మి, నూకరాజు, ధర్మేంద్ర, రత్నం, లత, అంబేడ్కర్ కాలనీ లబ్ధిదారులు పాల్గొన్నారు.



51వ వార్డులో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ



24వ వార్డులో బ్రోచర్ అందజేస్తున్న కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి

విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

సీతమ్మధార: విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి పెంచడం కోసం ప్రతి నెలా విద్యా శాఖ మండలి పరిధిలోని ఉపాధ్యాయులకు ఇన్ సర్వీస్ శిక్షణ లక్ష్యంగా తరగతులు నిర్వహిస్తోందని సీతమ్మధార మండల విద్యా శాఖ అధికారి డి.రామారావు తెలిపారు. సీతమ్మధార టీపీటీ కాలనీలోని ఎస్ఎంసీహెచ్ స్కూల్‌లో రెండో రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉన్న నేపథ్యంలో రెండు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. ఎస్ఎంసీహెచ్ స్కూల్‌లో 132 మంది ఉపాధ్యాయులకు రెండు విడతలుగా శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు తమ అనుభవాలను పంచుకుంటూ వారు ఎదుర్కొంటున్న ప్రశ్నలకు విద్యా పరంగా మిగిలిన ఉపాధ్యాయులతో చర్చించి తగు రీతిలో బోధించడానికి దోహదపడుతుందన్నారు. సీతమ్మధార మండల పరిధిలోని 25 పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు హాజరయ్యారు. వారికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విద్యా శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో మండల రిసోర్స్ పర్సన్ రేణుకా దేవిజగన్, సీఆర్పీ రాధ, ప్రధానోపాధ్యాయులు చిలకా రమణా, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలు ఉమాగాంధీ, సామాజిక ఉద్యమకారుడు భూషణం, ఏపీ ఎం.పి.ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిసిద్ధార్థ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు

10న శెట్టిబలిజ కార్తీక వన సమారాధన

సీతంపేట: ఈ నెల 10న అమలాపురం కొంకాపల్లి సమీపంలోని సత్తెమ్మతల్లి గుడి వద్ద శెట్టిబలిజ కార్తీక మాస వన సమారాధన నిర్వహించనున్నట్లు సంఘ అధికార ప్రతినిధి వాసంశెట్టి రాధాకృష్ణ తెలిపారు. కార్యక్రమ ప్రచార కరపత్రాలను శంకరమఠం రోడ్‌లోని ఒక హోటల్‌లో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి జరిగే వన సమారాధనలో విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఉన్న శెట్టిబలిజ కులస్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విశాఖపట్నం నాయకులు కట్టా మల్లేశ్వరరావు, కడలి సుబ్బారావు, బొక్కా ఏడుకొండలు, బొక్కా బాలయ్య, వాసంశెట్టి అర్జునరావు, కడలి సింహాచలం, బి.మధు, కడలి సత్యనారాయణ, కడలి శివకేశవరావు, వాసర్ల బాలకృష్ణ, మామిడిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వాసంశెట్టి రాధాకృష్ణ

రూ.2.14 కోట్లతో అభివృద్ధి పనులు

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డులో రూ.2.14 కోట్ల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపన జరిగింది. కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు చల్లా రజిని ఆధ్వర్యంలో ముఖ్య అతిథులు మేయర్ గొలగాని హరివెంకటకుమారి, నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లకు కె.కె.రాజు సూచించారు. జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు పనులను జరుగుతున్న సమయాల్లో పర్యవేక్షణ కచ్చితంగా ఉండాలన్నారు. వార్డులోని మర్రిపాలెం పరిధి 104 ఏరియా, జ్యోతినగర్, లక్ష్మీనగర్, మహారాణి వీధి, సూర్యనగర్ ప్రాంతాల్లో బీటీ రోడ్లు, గెడ్డలకు రిటైనింగ్ వాల్, డ్రైనేజీలు, గెడ్డలు, సీసీ రోడ్లు, డ్రైనేజీల పనులు జరుగుతాయని కార్పొరేటర్ రజిని తెలిపారు. కార్యక్రమంలో జోన్-5 ఎస్ఈ వేణుగోపాల్, ఈఈ మచ్చిరాజు, డీఈ భరణికుమార్, ఏఈ రత్నాకర్‌రావు, మండల ఇన్‌చార్జ్‌లు జి.వి.రమణి, కృష్ణారావు, అమర్‌రెడ్డి, వార్డు నాయకుడు కణితి చిరంజీవి, నారాయణరెడ్డి, రమణారెడ్డి, అచ్యుతరావు, ప్రసాద్, వెంకటేష్, రాంబాబు, శ్రీను, నమ్మి శంకర్, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.



జ్యోతినగర్‌లో శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, కె.కె.రాజు

పక్కాగా పారిశుధ్య నిర్వహణ



సిబ్బందికి సూచనలిస్తున్న జెడ్సీ కృష్ణ

మర్రిపాలెం: వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ పక్కాగా ఉండాలని జీవీఎంసీ జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ ఆదేశించారు. 53వ వార్డు మర్రిపాలెం పరిసర ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించి ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ రోడ్లు, కాలువలు, గెడ్డల్లో చెత్తాచెదారం వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దుకాణాల వద్ద విధిగా చెత్తబుట్టలు ఉండేలా చూడాలని సూచించారు. డోర్ టు డోర్ కలెక్షన్ సక్రమంగా చేపట్టాలన్నారు. అనంతరం ఆయన సిబ్బంది హాజరు పట్టీలను పరిశీలించారు. జెడ్సీ వెంట వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయం సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది ఉన్నారు.

నేడు ప్రత్యేక వైద్య శిబిరం

కంచరపాలెం: ప్రపంచ ఎయిడ్స్ డేను పురస్కరించుకుని శుక్రవారం మల్టీ స్పెషాలటీస్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పద్మశ్రీ పురస్కార గ్రహీత, వైద్య నిపుణుడు డాక్టర్ కూటికుప్పల సూర్యారావు తెలిపారు. కంచరపాలెంలోని కూటికుప్పల సూర్యారావు హాస్పిటల్ వద్ద గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కిడ్నీ పనితీరు, గుండె సమర్థత, నరాల పటుత్వం, ఎముకుల దృఢత్వం, దృష్టిదోష పరీక్షలు, కంటి ఆపరేషన్లు ఉచితంగా చేసి మందులు అందిస్తారన్నారు. ప్రత్యేక వైద్య నిపుణుల పర్యవేక్షణలో వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు.

పార్టీ విజయానికి పనిచేయండి

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు టీఎస్ఎన్ కాలనీలోని హోటల్ సింకా గ్రాండ్‌లో గురువారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గొంపా గోవిందరాజు ఆధ్వర్యంలో ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. గోవిందరాజు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేలా పార్టీ శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. జీవీఎంసీ పరిధిలోని 98 వార్డులకు కమిటీలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సెల్ వంటి అనుబంధ సంఘాలను నియమించారు.

దొంగ ఓట్లపై ఫిర్యాదు చేస్తాం

సీతమ్మధార: దొంగ ఓట్లు ఉన్నాయని ఫిర్యాదులు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఎంపీ జీవీఎల్ నర్సింహారావు అన్నారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని బీజేపీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దొంగ ఓట్ల వ్యవహారం ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామన్నారు. చనిపోయిన వారు ఓటర్ లిస్టులో ఉన్నారని, వారు ఓటెలా వేస్తారన్నారు. తెలంగాణ ఎన్నికల్లో బీజేపీకి మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ ఉత్తర నియోజకవర్గంలో 40 వేల దొంగ ఓట్లు ఉన్నాయన్నారు. 1,429 ఇళ్లలో పది మందికి పైగా ఓటర్లు ఉన్నారని, కలెక్టర్ చొరవ తీసుకొని దొంగ ఓట్లు తొలగించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ జీవీఎల్ నర్సింహారావు

బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం

సీతమ్మధార: అన్ని పోలింగ్ బూత్‌లలోనూ కమిటీలను ఏర్పాటు చేసి తద్వారా రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్రరెడ్డి పిలుపునిచ్చారు. సీతమ్మధార రైతుబజార్ ఎదురుగా గల కేవీఆర్ కాంప్లెక్స్‌లో విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర అధ్యక్షతన గురువారం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఎంపీ జీవీఎల్ నర్సింహారావు, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, సురేంద్రమోహన్, డాక్టర్ కె.సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం

మర్రిపాలెం: ప్రేమించిన యువకుడి తరఫు వారు కొట్టారన్న నెపంతో ఒక యువతి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. రెడ్డి కంచరపాలేనికి చెందిన ఆర్.కీర్తి బర్మాక్యాంప్‌నకు చెందిన భరత్‌కుమార్ అనే యువకుడిని కొంతకాలంగా ప్రేమించింది. కీర్తి తండ్రి పెయింటింగ్ పనులు చేస్తుంటాడు. బుధవారం ఉదయం కీర్తి ఇంటికి వెళ్లిన భరత్‌కుమార్ తల్లిదండ్రులు సత్య, రామకృష్ణ, కుటుంబ సభ్యులు కీర్తిని తిట్టడమే కాకుండా చేయి చేసుకున్నారు. దీంతో మనస్తాపానికి గురైన కీర్తి ఫినాయిల్ తాగగా తల్లి అడ్డుకుంది. ఆమెను కూడా వారు దూషించారు. కీర్తిని కుటుంబ సభ్యులు వెంటనే కేజీహెచ్‌కి తరలించారు. ఆస్పత్రిలో కీర్తి వద్ద పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. సీఐ ఎస్.సాయి పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ పి.వి.ఎల్.నరసింహం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దంపతులపై గుర్తుతెలియని వ్యక్తి దాడి

మర్రిపాలెం: ఇంట్లో దంపతులపై గుర్తుతెలియని వ్యక్తి దాడి చేసిన సంఘటన ఇది. ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం చెవిట రాముల వీధిలో కడవల వెంకటేశ్వరరావు(62) నివసిస్తున్నాడు. భార్యాభర్తలు టిఫిన్ షాపు నిర్వహిస్తున్నారు. బుధవారం రాత్రి వీరు ఇంట్లో టిఫిన్ సామగ్రి తయారు చేస్తుండగా ఒక గుర్తు తెలియని వ్యక్తి వీరిపై దాడి చేశాడు. బయట నుంచి తలుపు వేసి వెళ్లిపోయాడు. దంపతుల కేకలు విని ఇరుగుపొరుగు వారు వచ్చి తలుపు తీసి వెంకటేశ్వరరావుని కేజీహెచ్‌కి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ సతీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దర్యాప్తు ముమ్మరం

సీతమ్మధార: ఇంటర్మీడియట్ విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసులో గురువారం ద్వారకా పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇప్పటికే ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆశీలమెట్ట దరి ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్న బాలికను అదే కాలేజీకి చెందిన నాన్ టీచింగ్ స్టాఫ్ వారాడ వెంకటనాయుడు వేధిస్తున్న విషయం తెలిసిందే. దీనిపై మరి కొంత మంది వద్ద ద్వారకా ఎస్ఐ శ్రీను స్టేట్‌మెంట్‌లు తీసుకున్నారు. ఇంత జరిగినా కళాశాల యాజమాన్యం ఎందుకు నిర్లక్ష్య ధోరణిలో ఉందన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. విద్యా శాఖ అధికారులు కళాశాల యాజమాన్యానికి నోటీసులు ఇచ్చారు. పోలీస్ శాఖ అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు.